సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం । 19 । అక్టోబర్ । 2023



సోమశిలలో 30.540 టీఎంసీలు

సోమశిల జలాశయంలో బుధవారానికి 30.540 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఫైతట్టు ప్రాంతాల నుంచి 962 క్యూసెక్కుల ప్రవాహం వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.61,610
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,563
3శాతం జీఎస్టీతో	రూ.5,730
నవర (8గ్రా)	రూ.45,840

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 36.3 /26.5

బుధవారం గాలిలో తేమ 52 శాతం ఉంది. గురువారం ఎండతీవ్రత, ఉష్ణోగ్రతలు కొంచెం పెరిగే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

బాల్య వివాహాలు సరికాదు

- ఐటీడీఏ పీఓ ఎం.రాణి



మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ ఎం.రాణి

వెంకటాచలం: తల్లిదండ్రులు, తమ పిల్లలకు బాల్య వివాహాలు చేయడం సరికాదని, దాని వల్ల చాలా ఇబ్బందులు తలెత్తుతాయని ఐటీడీఏ పీఓ ఎం.రాణి సూచించారు. మండలంలోని కురిచెర్లపాడు ఎస్టీ కాలనీలో బుధవారం బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు అవగాహనతో బాల్య వివాహాలు చేయడం మానుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించే దిశగా ఆలోచన చేయాలన్నారు. ఈ సదస్సులో జిల్లా బాలల సంరక్షణ అధికారి బి.సురేష్‌బాబు, ఐటీడీఏ ఏఎంఓ శాంతకుమారి, ఎంపీటీసీ ప్రభావతి, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జగనన్న చేదోడు ద్వారా రూ.69.18 కోట్లు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్ర ప్రభుత్వం చేతి వృత్తుల వారికి అందజేస్తున్న జగనన్న చేదోడు పథకం ద్వారా జిల్లాకు మూడు విడతల్లో మొత్తం రూ.69.18 కోట్లు మంజూరు అయ్యాయని బీసీ కార్పొరేషన్ పీడీ నిర్మాలాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలియచేశారు. జిల్లాలో దుకాణాలు నిర్వహిస్తున్న రజకులు, నాయీ బ్రాహ్మణులు, టైలర్స్ తోపాటు అన్ని కులాలకు చెందిన వారికి మూడు విడతల్లో ఈ పథకం ద్వారా నిధులు మంజూరు అయ్యాయని తెలియచేశారు.

27న ఓటర్ల ముసాయిదా జాబితా



రాజకీయ పార్టీల నేతలతో మాట్లాడుతున్న ఆర్డీఓ మలోల

నెల్లూరు రూరల్: నెల్లూరు ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం ఎన్నికలకు సంబంధించిన అంశాలపై ఆర్డీఓ మలోల సమావేశం నిర్వహించారు. ఓటర్ల నమోదును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నెల 27వ తేదీన ఓటర్ల జాబితా ప్రకటిస్తామన్నారు. వచ్చే ఎన్నికలలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించటం జరుగుతుందన్నారు. ఓటర్ల నమోదు విషయంలో ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ అభ్యంతరాలను తెలుపాలన్నారు. రూరల్ నియోజకవర్గంలోని పలు రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి దాతల సాయం

ఉలవపాడు: 'చిన్నారికి పెద్ద కష్టం' శీర్షికతో సాక్షిలో వచ్చిన కథనానికి దాతలు బాగా స్పందిస్తున్నారు. మాకా శ్రావ్య ఆరోగ్యం కాస్త మెరుగు పడుతుండడంతో దాతలు మరింతగా ముందుకు వచ్చి పాప ఆరోగ్యంగా బయటకు రావాలని నగదు పంపిస్తున్నారు. సింగరాయకొండ అమృత విద్యాసంస్థల యాజమాన్యం కేశవరపు జాలిరెడ్డి రూ.30,000 వారి కుటుంబ సభ్యులకు అందించారు. సోమశిల ప్రాజెక్టులో డీఈఈగా పనిచేస్తున్న చిరుతోటి సుధీర్ రూ.20,000 ఫోన్ పే ద్వారా అందించారు. అంతే కాకుండా దాదాపు 150 మంది దాతలు రూ.1,00,000 అందించారు. ఒక రోజే రూ.1.50 లక్షలు దాతలు శ్రావ్య తండ్రి సురేష్ బ్యాంకు ఖాతాకు అందించారు.

ఇద్దరు బాలికల అదృశ్యం

- తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు

సంగం: ఒకే గ్రామంలో ఉంటూ ఒకే పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఇద్దరు బాలికలు ఒకే రోజు అదృశ్యమైన సంఘటన మండలంలోని మక్తాపురంలో చోటుచేసుకుంది. బాలికల తల్లిదండ్రుల ఫిర్యాదుతో సంగం పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మక్తాపురం గ్రామానికి చెందిన 15 సంవత్సరాల వయస్సు కలిగిన ఇద్దరు బాలికలు దువ్వూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నారు. మంగళవారం రాత్రి భోజనం అనంతరం వారి ఇళ్లలోనే నిద్రించిన బాలికలు బుధవారం ఉదయం చూసేసరికి అదృశ్యమయ్యారు. ఆందోళన చెందిన బాలికల తల్లిదండ్రులు బుధవారం సంగం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై నాగార్జునరెడ్డి కేసు నమోదు చేసి బాలికల ఆచూకీ కోసం ముమ్మర దర్యాప్తు చేపట్టారు.

కూరగాయలు కొనాలన్నా తూకంలో మోసం.. మిఠాయి దుకాణంలోను, విత్తనాల షాపులోను, రోడ్డుపై చేపలు, రొయ్యలు విక్రయించే వద్దా.. ఇలా అంతటా తూకంలో మాయే. ఈ మాయా జాలంతో వినియోగదారుడిని నిలువునా ముంచేస్తున్నారు. తూకంలో మోసాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు నామమాత్రపు దాడులు చేసి మమ అనిపిస్తున్నారు. వినియోగదారులు మాత్రం దోపిడీకి గురవుతూనే ఉన్నారు.



మినీబైపాస్ రోడ్డులోని వనంతోపు ఏరియాలో చేపల అమ్మకాల వద్ద గుమిగూడిన ప్రజలు

టక్కరి తక్కెడ!

వస్తు విక్రయాల్లో నిలువు దోపిడీ

- మోసపోతున్న వినియోగదారులు
- సాధారణ కాటా, ఎలక్ట్రానిక్ మెషీన్లలోనూ చేతివాటం
- చేపలు, మాంసం దుకాణాల వద్దా ఇదే తీరు
- తూచేది 1000 గ్రాములు.. వచ్చేది 750 గ్రాములే
- నామమాత్రపు తనిఖీలతో ఆగని మోసాలు

నగరంలోని జీవీ నగర్‌కు చెందిన వెంగయ్య యాదవ్ రెండు రోజుల క్రితం వనంతోపు సెంటర్ వద్ద మినీబైపాస్ పక్కనే ఉన్న చేపల దుకాణంలో నాలుగు కేజీల చేపను కొనుగోలు చేశాడు. చేపలను కట్ చేయించి మళ్లీ తూకం వేయించాడు. అప్పుడు 3 కేజీల 200 గ్రాములు వచ్చింది. అదే సందిని మరో చికెన్‌షాపులో తూకం వేస్తే 2 కేజీల 950 గ్రాముల తూకం వచ్చింది. అంటే 250 గ్రాముల వరకు తూకంలో మోసం చేసినట్లుగా నిర్ధారణ అయింది. అంటే కేజీలో పావు కిలో మోసం చేస్తున్నారు. కేజీ చేప (లైవ్ ఫిష్) రూ.160 వరకు ధర ఉంది. ఈ ప్రకారం చూస్తే కేజీకి దాదాపు రూ.40 వరకు అదనంగా దోపిడీ చేస్తున్నారు.

వనంతోపు ప్రాంతానికి చెందిన రమణయ్య అన్నమయ్య సర్కిల్ సమీపంలో మొబైల్ ఆటోలో ఏర్పాటు చేసిన పండ్ల దుకాణంలో జామ, యాపిల్, అరటి పండ్లను కేజీల లెక్కన కొనుగోలు చేశాడు. కాటాతో పాటు తూకం రాళ్లు కూడా పాతవే. పండ్లు కూడా తక్కువగానే వచ్చాయి. కేజీకి యాపిల్ 5 మాత్రమే తూగాయి. అనుమానం వచ్చి వేరే చోట తూకం వేస్తే ఆ పండ్లు 680 గ్రాములే వచ్చాయి. అరటి పండ్లు తూచినా అదే పరిస్థితి. తాను మోసపోయానని తెలుసుకుని పండ్ల దుకాణం వారిని నిలదీస్తే మా తూకంలో తప్పు లేదంటూ బుకాయించారు.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఇలా ఎంతో మంది నగర వాసులు తూకంలో మోసాలతో దోపిడీకి గురవుతున్నారు. నెల్లూరు సిటీలో చిన్న కిరాణాషాపు నుంచి సూపర్ మార్కెట్ల వరకు తూకంలో చేతివాటం ప్రదర్శిస్తుండడంతో వినియోగదారులు మోసపోతున్నారు. బియ్యం, ఉప్పు, పప్పు, కూరగాయలు, మాంసం.. ఇలా ఏది కొనుగోలు చేసినా కిలోకు 900 గ్రాములే వస్తోంది. ఇక లీటర్లలో కొనుగోలు చేసే వస్తువులైతే లీటర్‌కు 800–850 మిల్లీలీటర్లే వస్తున్నాయి. సాధారణ కాటాతో పాటు ఎలక్ట్రానిక్ మెషిన్లలో సెట్టింగ్‌లు చేస్తూ వ్యాపారులు ఈ మోసాలకు పాల్పడుతున్నారు. చట్టాల్లోని లొసుగులే ఆసరాగా దోపిడీ చేస్తూ తప్పించుకుంటున్నారు.

ఆప్షన్స్‌తో గోల్‌మాల్

ఎలక్ట్రానిక్ వేయింగ్ మెషీన్‌లో మొత్తం నాలుగు ఆప్షన్లు ఉంటాయి. ఇందులో ఒకదాని సహాయంతో వ్యాపారులు మోసాలకు పాల్పడుతున్నారు. కిలోకు 100–150 గ్రాముల తక్కువగా ఉండేలా సెట్ చేస్తున్నారు. అప్పుడు ఆ ఆప్షన్ నొక్కి మెషిన్‌పై 850–900 గ్రాములు బరువు ఉంచితే అది 1000 గ్రాములుగా డిస్‌ప్లే అవుతుంది. అదే మెషిన్‌పై కిలో బరువు ఉంచితే 1100–1150 గ్రాములు చూపుతుంది. అంటే కిలోకు 100–150 గ్రాముల వరకు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. మెషీన్‌లోని మరో ఆప్షన్‌ను నొక్కితే తూకం వచ్చినప్పుడు సరైన ఆప్షన్‌తో తూకం వేస్తూ వ్యాపారులు బోల్తా కొట్టిస్తున్నారు. ఇలాంటి సంఘటనలు బయటపడిన సందర్భాలు కూడా ఉన్నాయి.

ప్యాకింగ్‌లో సైతం

మార్కెట్‌లో లభించే వివిధ బ్రాండ్ల నూనె ప్యాకెట్లు కూడా నిర్దేశించిన బరువు కంటే తక్కువగా ఉంటున్నాయి. లీటర్ ప్యాకేజ్డ్ నూనె నిబంధన ప్రకారం ప్యాకెట్‌లో 910 మిల్లీలీటర్లు ఉండాలి. కానీ 800–850 గ్రాములు మించడం లేదు. ఇక ఐదు లీటర్ల ప్యాకేజ్డ్ బాటిల్‌లో 200–280 గ్రాములు. 15 లీటర్ల ప్యాకేజ్డ్ బాటిల్‌లో 250–300 మిల్లీలీటర్లు తక్కువగా ఉంటోంది. తక్కువ తూకం గల ప్యాకింగ్‌లు సైతం తూనికలు, కొలతల శాఖ దాడుల్లో బయటపడడమే ఇందుకు నిదర్శనం.

పసిడి (బంగారం)లోనూ..

నగరంలోని పెద్ద పెద్ద దుకాణాల్లో మినహా మిగతా వాటిలో సాధారణంగా 22 క్యారెట్ల కంటే తక్కువ నాణ్యత కలిగిన బంగారాన్నే విక్రయిస్తుంటారు. వ్యాపారులు 18 క్యారెట్ల ఆభరణాన్ని వినియోగదారులకు విక్రయించి... 22 క్యారెట్లకు బిల్లు వసూలు చేస్తున్నారు. 22 క్యారెట్లు, 18 క్యారెట్ల ఆభరణానికి మధ్య గ్రాముకు కనీసం రూ.500 నుంచి రూ.700 వరకు తేడా ఉంటుంది. ఈ లెక్కన కనీసం 10 గ్రాములకు రూ.5వేల నుంచి రూ.7వేల వరకు నష్టం తప్పదు. బంగారం తూచే ఎలక్ట్రానిక్ కాటాల వెనుక త్రాసును నియంత్రించే వీల్స్ బేరింగ్‌లను మార్పు చేసే అవకాశం ఉంటుంది. బంగారం నాణ్యతను తెలిపే మెషిన్ లేకపోవడంతో వినియోగదారులు మోసాలకు గురవుతున్నారు. నగరంలో పెద్ద, చిన్న చితకా వ్యాపార సంస్థలన్నీ కలిపి సుమారు లక్షకు పైగా ఉంటాయి. వీటిలో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి మోసాలను అరికట్టాల్సిన బాధ్యత తూనికలు, కొలతల శాఖ అధికారులపై ఉంది. అయితే కొనుగోలుదారులు ఫిర్యాదులు చేస్తేనే తనిఖీలు చేస్తున్నారు. తూకాల్లో మోసం, నిబంధనల ఉల్లంఘనలపై మొదటిసారి జరిమానా విధిస్తారు. అదే తప్పు తిరిగి చేస్తే కేసు నమోదు చేసి కోర్టుకు సిఫార్సు చేస్తారు. కోర్టు జరిమానాతో పాటు జైలు శిక్ష విధించే అవకాశం ఉంది. అయితే కోర్టు జైలు శిక్ష విధించిన కేసులు పెద్దగా లేనట్లు తెలుస్తోంది. తక్కువ తూకం వేస్తే తూనికలు, కొలతల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ 2009 యాక్టు సెక్షన్ 30 ప్రకారం కనీసం రూ.1000 నుంచి రూ.10వేల వరకు జరిమానా విధిస్తారు. ప్యాకేజీ కమోడిటి యాక్ట్ 30 ప్రకారం నిబంధనలు ఉల్లంఘించే వారికి రూ.2వేల నుంచి రూ.25 వేల వరకు జరిమానా వేస్తారు.

ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటాం

తూకంలో మోసాలు జరుగుతున్నట్లు తమకు ఫిర్యాదు చేస్తే తప్పక చర్యలు తీసుకుంటాం. కూరగాయలు, చికెన్, చేపల మార్కెట్లలో ధర్మకాటాలు కూడా ప్రవేశపెట్టాం. తూకంలో తేడాలు కన్పిస్తే ధర్మకాటా ద్వారా తూకం వేసుకొని సరిచూసుకోవచ్చు. తక్కువ తూకం వస్తే తమ దృష్టికి తెస్తే తప్పకుండా దుకాణదారులపై చర్యలు తీసుకుంటాం. వనంతోపు సెంటర్‌లో కూడా తూకంలో మోసాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. తనిఖీలు నిర్వహించి కాటాలను సీజ్ చేస్తాం. – ఐజాక్, డిప్యూటీ కంట్రోలర్, నెల్లూరు



అన్ని చోట్లా ఇలాంటి కాటాలే

■ నేటి అలంకారం



రాజరాజేశ్వరీ అమ్మవారు గజలక్ష్మిగా

పేదలకు వరం జగనన్న ఆరోగ్య సురక్ష



వైద్యశిబిరంలో మాట్లాడుతున్న కమిషనర్

నెల్లూరు(బారకాసు): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరం లాంటిదని కమిషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. పడారుపల్లి, ఎస్టీటీ కాలనీ, ఏసీనగర్‌లోని మల్లెల సంజీవయ్య పాఠశాల, పాత మున్సిపల్ కార్యాలయ ప్రాంతాల్లో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరాలను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదనపు కమిషనర్ శర్మద, ఎంహెచ్‌ఓ వెంకటరమణ, వైద్యాధికారి జిజియాబాయి, టీపీఆర్వో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయిలోనే సమస్యల పరిష్కారం



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

- జిల్లా కలెక్టర్ హరినారాయణన్
- మర్రిపాడులో అర్జీల స్వీకరణ

మర్రిపాడు: మండల పరిధిలోని సమస్యలను సంతృప్తికరంగా స్థానికంగానే పరిష్కరించేలా జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. బుధవారం మర్రిపాడు మండల పరిషత్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, ఆర్డీఓ కరుణకుమారి, తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ బాపిరెడ్డిలతో కలసి ఆయన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి రాలేని గ్రామీణ ప్రజల సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడే సంతృప్తికర స్థాయిలోనే పరిష్కరించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అన్నారు. ప్రజల నుంచి 275 అర్జీలు వచ్చాయని, వీటిలో సుమారు 90 శాతం భూ సంబంధిత సమస్యలే ఉన్నాయన్నారు. రానున్న రోజుల్లో ప్రజల సమస్యలకు మరింత సంతృప్తికర స్థాయిలో పరిష్కారం చూపేలా అధికారులు కృషి చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ చిరంజీవి, డీఆర్డీఏ, డ్వామా, ఐసీడీఎస్ పీడీలు సాంబశివారెడ్డి, వెంకట్రావు, హేనాసుజన, సీపీఓ ఏఎస్ రాజు, డీటీసీ చందర్, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి సుధాకరరాజు, జిల్లా ఉద్యాన శాఖాధికారి సుబ్బారెడ్డి, సర్వే రికార్డుల ఏడీ హనుమాన్ ప్రసాద్, పలువురు జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయండి

- గడప గడపకు మన ప్రభుత్వంలో మంజూరైన పనులను నెలాఖరుకు పూర్తి చేయాలి
- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదేశం



అధికారులతో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు (పొగతోట): జిల్లాలో పేదల గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి హౌసింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం స్థానిక జిల్లా పరిషత్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో గృహ నిర్మాణం, భూ సమస్యలు, పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగాలు, భూ పంపిణీ, సర్వేపల్లి నియోజకవర్గం సమస్యలపై కలెక్టర్ హరినారాయణన్, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ సమక్షంలో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదల గృహ నిర్మాణాల్లో అక్కడక్కడ అవకతవకలు జరుగుతున్నట్లు లబ్ధిదారులు తమ దృష్టికి తీసుకువస్తున్నారని, గృహ నిర్మాణాల్లో అవకతవకలు జరిగితే సహించేది లేదని హౌసింగ్ అధికారులను హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో ఎక్కడా కూడా హౌసింగ్‌లో పొరపాట్లు జరగకుండా చూడాలన్నారు. లబ్ధిదారుల నుంచి డబ్బులు తీసుకొని పనులు పూర్తి చేయని కాంట్రాక్టర్లపై పోలీసు కేసులు పెట్టాలని అధికారులను ఆదేశించారు. సర్వేపల్లి నియోజకవర్గంలో ఇళ్ల నిర్మాణాల పురోగతిని ఏరోజుకారోజు తనకు వివరించాలని ఆదేశించారు. నియోజకవర్గంలో ఎస్టీ లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాల కోసం ఇచ్చిన రూ.15 వేలు సక్రమంగా వినియోగించారా? లేదా? అని విచారించి నివేదిక నివ్వాలని ఎంపీడీఓలను మంత్రి ఆదేశించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన అన్ని పనులను ఈనెలాఖరులోగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో పర్యటించినప్పుడు ప్రజలు కోరిన సిమెంట్ రోడ్లు, సైడ్‌కాలువలు, ఇతర అభివృద్ధి పనులను ప్రభుత్వం మంజూరు చేసిందని, వీటిపై ప్రత్యేక దృష్టి సారించి పూర్తి చేయాలన్నారు. పరిశ్రమల్లో స్థానిక యువతకు 75 శాతం ఉద్యోగాలు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు. నిబంధనలు పాటించని యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి వెనకాడవద్దని పేర్కొన్నారు. కొత్తగా స్థాపించే పరిశ్రమల యాజమాన్యాలకు ముందుగానే 75శాతం ఉద్యోగాలు స్థానికులకు కేటాయించాలని తెలియజేయాలన్నారు. జిల్లాలో అర్హులైన సాగుదారులకు త్వరలో పట్టాల పంపిణీ చేయనున్నట్లు, ఇందుకు సంబంధించిన ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలన్నారు. అలాగే గ్రామాల్లో ఉన్న రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి త్వరిత గతిన పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ నాగరాజు, ఆర్‌డబ్ల్యుఎస్, ఆర్‌అండ్‌బి, పీఆర్ ఎస్‌ఈలు రంగవరప్రసాద్, గంగాధర్, అశోక్ కుమార్, ఇండస్ట్రీస్ జీఎం సుధాకర్, ఆర్డీఓ మలోల, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

మళ్లీ విజయఢంకా మోగిద్దాం

- నెల్లూరు, తిరుపతి, ప్రకాశం జిల్లాల వైఎస్సార్‌సీపీ ఎస్సీ ముఖ్యనాయకుల ప్రాంతీయ సదస్సులో మంత్రి మేరుగు నాగార్జున
- సామాజిక న్యాయ బస్సుయాత్రపై సన్నాహక సమావేశం
- దళితులందరూ జగన్‌మోహన్‌రెడ్డికి మళ్లీ అండగా ఉండాలి
- దళితుల అభ్యున్నతికి జగనన్న నిరంతరం శ్రమిస్తున్నారు



నెల్లూరు రవీంద్రనాథ్ ఠాగూర్ ఆడిటోరియంలో జరిగిన వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ ముఖ్య నాయకుల సామాజిక న్యాయ బస్సుయాత్ర సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున. చిత్రంలో ఎస్సీ సెల్ నాయకులు జూపూడి,ఎంపీ గురుమూర్తి తదితరులు

నెల్లూరు (దర్గామిట్ట): పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని, దళితులకు పెద్దపీట వేసి వారి అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి దళితులందరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి మేరుగు నాగార్జున పేర్కొన్నారు. బుధవారం నగరంలోని రవీంద్రనాథ్ ఠాగూర్ కళ్యాణ మండపంలో తిరుపతి, నెల్లూరు, ప్రకాశం జిల్లాల వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ ముఖ్య నాయకులతో సామాజిక బస్సుయాత్ర విజయవంతంపై సన్నాహక సమావేశం జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు పందింటి కామరాజు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి మేరుగు మాట్లాడుతూ ఏపీలో దళితుల సంక్షేమానికి చంద్రబాబు పాలనలో ప్రాధాన్యం ఇవ్వలేదన్నారు. చంద్రబాబు పాలనలో బరితెగించాడని.. ఎస్సీ కులంలో ఎవరైనా పుట్టాలని అనుకుంటారా అని అన్నారన్నారు. అచ్చెన్నాయుడు దళితులపై ఎగిరి మోకాలితో తన్నిన సంఘటనలు ఉన్నాయన్నారు. విశాఖలో దళిత మహిళను వివస్త్రను చేస్తే చంద్రబాబు ఏ మాత్రం చలించలేదన్నారు. గుంటూరులో రవికుమార్ అనే ప్రభుత్వ ఉద్యోగిని చంపితే కేసులు కూడా పెట్టనీయలేదన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అయ్యాక రాష్ట్రంలో దళితులకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. మనందరిలో చిన్నపాటి భేదాభిప్రాయాలు ఉన్నా పక్కన పెట్టి అందరం కలిసి జగన్ మోహన్‌రెడ్డిని మళ్ళీ సీఎంని చేసుకోవాలన్నారు. గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు మాట్లాడుతూ దళితులంటే తెలుగుదేశం పార్టీకి, చంద్రబాబుకు చులకన అని, చంద్రబాబు పాలనలో దళితులు గుర్తుంచుకునే పథకం ఒక్కటన్న చేశారా? అని విమర్శించారు. అంబేద్కర్ తర్వాత ఎస్సీ, ఎస్టీలకు నిస్పక్షపాతంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఎన్నో సేవలు చేశారన్నారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నవరత్నాల పథకాల్లో అత్యధికులు ఎస్సీ, ఎస్టీలేనన్నారు. సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ అణగారిన వర్గాలకు నాణ్యమైన విద్యను అందించాలని, ఇంగ్లీష్ బోధనతో పాటు నాడు–నేడు పథకం ద్వారా సమూల మార్పులు చేశారని పేర్కొన్నారు. దళారీ వ్యవస్థ లేకుండా ప్రతి పేదవాడిని ఆర్థికంగా అభివృద్ధి చేయాలన్నదే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. ఎమ్మెల్సీ, స్టేట్ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ బండితోక అరుణ్ కుమార్ మాట్లాడుతూ సామాజిక న్యాయ బస్సు యాత్రను అందరి సహాయ సహకారాలతో విజయవంతం చేసుకుందామని అన్నారు. అంబేద్కర్ ఆశయాలు జగనన్నతోనే సాధ్యమన్నారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు పందింటి కామరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలనలో దళితులకు పెద్దపీట వేశారని అన్నారు. అధికారం చేపట్టినప్పటి నుంచి జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు వల్ల దళితుల జీవన ప్రమాణాలు అభివృద్ధి చెందాయన్నారు. కార్యక్రమంలో బాపట్ల ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్సీల మేరిగ మురళీధర్, బల్లి కళ్యాణ్ చక్రవర్తి, ప్రాంతీయ అధ్యక్షుడు దేవదానం, నల్లారి బాబు, దేవప్రసాద్, మాజీ ఏఎంసీ అధ్యక్షుడు ఏసునాయుడు, రైల్వే బోర్డు మెంబర్ స్వర్ణా వెంకయ్య, జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

చీకటి దొంగ ముసుగులో ప్రతిపక్షాలు

– జూపూడి ప్రభాకర్, స్టేట్ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్

చీకటి ముసుగులో ప్రతిపక్షాలు ఉన్నాయని, వెలుతురుతో ప్రజల పక్షాన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఉన్నాడని, మనందరం ఒక్కతాటిపై నిలచి మళ్లీ ఆయనను ముఖ్యమంత్రిని చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ జూపూడి ప్రభాకర్ అన్నారు. పేదోళ్లకు ఆంగ్ల బోధన అవసరాన్ని గుర్తించి ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లిష్ మీడియాన్ని ప్రవేశ పెట్టిన ఘనత జగన్ మోహన్‌రెడ్డిదన్నారు. అంబేద్కర్ ఆశయ సాధనలో భాగంగా పేదలందరికి సుమారు 32 లక్షల ఇళ్లు అందించాలనేది ముఖ్యమంత్రి లక్ష్యమని తెలిపారు.

అందరం సంఘటితమవుదాం

– గురుమూర్తి, ఎంపీ, తిరుపతి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ ఫలాల ద్వారా దళితులకు ఎక్కువ భాగం మేలు జరిగిందని, సామాజిక న్యాయ బస్సుయాత్రను విజయవంతం చేసేందుకు అందరం సంఘటితం కావాలని తిరుపతి ఎంపీ గురుమూర్తి అన్నారు. ప్రతి నియోజకవర్గంలో జరిగే బస్సు యాత్రలో ఎస్సీ వర్గీయులంతా ఏకమై కార్యక్రమాలు విజయవంతం చేయాలన్నారు. అందరం కలిసి కట్టుగా పనిచేసి మళ్లీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని సీఎంగా చేసుకోవాలన్నారు.

క్లుప్తంగా

యువకుడి అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): ఇంటి నుంచి బయటకెళ్లిన యువకుడు అదృశ్యమైన ఘటనపై సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. రాజేంద్రనగర్‌లో నివాసం ఉంటున్న పెంచలయ్య కుమారుడు దేవీనరసింహ పంజాబ్‌లో బీఎస్సీ అగ్రికల్చర్ చదువుతున్నారు. ఆరోగ్యం సక్రమంగా లేకపోవడంతో ఇంటికి ఆగస్టులో వచ్చారు. ఇంటి నుంచి ఈ నెల 16న సాయంత్రం బయటకెళ్లిన ఆయన జాడ తెలియరాలేదు. గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లభించలేదు. ఫోన్ స్విచ్ఛాఫ్ అని వస్తుండటంతో సంతపేట పోలీసులకు పెంచలయ్య ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

నెల్లూరు(క్రైమ్): సెలవులు కావడంతో స్నేహితులతో కలిసి సరదాగా పెన్నాలో ఈతకెళ్లిన బాలుడు ప్రమాదవశాత్తూ నీటిలో మునిగి మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. సంతపేటకు చెందిన సుందరరావు (లేట్), కీర్తి దంపతుల చిన్న కుమారుడు అక్షయ్ (13) రంగనాయకులపేటలోని పీఎమ్మార్ స్కూల్లో చదువుతున్నారు. దసరా సెలవులు కావడంతో సాయంత్రం ఐదు గంటల సమయంలో స్నేహితులతో కలిసి రంగనాథస్వామి దేవస్థాన సమీపంలో పెన్నాలో ఈత కొట్టేందుకు వెళ్లారు. సాయంత్రం ఆరు గంటలైనా ఇంటికి అక్షయ్ రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టగా, పెన్నాలో ఈతకొట్టేందుకు వెళ్లాడని తెలిసింది. దీంతో వారు పెన్నా వద్దకెళ్లి అక్కడున్న వారిని విచారించగా, కొందరు పిల్లలు ఈత కొడుతూ కనిపించారని తెలిపారు. ఇంతలో బాలుడి చెప్పులు, దుస్తులు అక్కడ ఉండటాన్ని కుటుంబసభ్యులు గమనించారు. నదిలో పడ్డారేమోనని.. రక్షించాల్సిందిగా అక్కడి వారిని కోరారు. గాలింపు చర్యలు చేపట్టగా, రాత్రి 8 గంటల సమయంలో అక్షయ్ మృతదేహాన్ని గుర్తించారు. కొన ఊపిరితో ఉండొచ్చనే ఉద్దేశంతో రామచంద్రారెడ్డి హాస్పిటల్‌కు తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందారని నిర్ధారించారు. సమాచారం అందుకున్న సంతపేట పోలీసులు విచారణ జరుపుతున్నారు.


నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: రూ.120
లేయర్ (లైవ్)	: రూ.118
బ్రాయిలర్ చికెన్	: రూ.210
స్కిన్‌లెస్ చికెన్	: రూ.230
లేయర్ చికెన్	: రూ.200

నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.55
సన్నవి	: రూ.25
పండ్లు	: రూ.5



జగనన్న పాలన దేశానికే ఆదర్శం



మాట్లాడుతున్న నందిగం సురేష్. చిత్రంలో జూపూడి, ఎంపీ గురుమూర్తి తదితరులు

• బాపట్ల ఎంపీ నందిగం సురేష్

నెల్లూరు (దర్గామిట్ట): సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శమని బాపట్ల ఎంపీ నందిగం సురేష్ పేర్కొన్నారు. సామాజిక న్యాయ బస్సు యాత్రపై తిరుపతి, నెల్లూరు, ప్రకాశం జిల్లాల ఎస్సీ సెల్ అధ్యక్షులతో సన్నాహక సమావేశాన్ని నగరంలోని రవీంద్రనాథ్ టాగూర్ కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించారు. అనంతరం ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జూపూడి ప్రభాకర్‌రావు, తిరుపతి ఎంపీ గురుమూర్తి, బండితోక అరుణ్‌కుమార్‌తో కలిసి విలేకరుల సమావేశంలో సురేష్ మాట్లాడారు. నవరత్నాల ద్వారా పేద, మధ్య తరగతి వర్గాలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నారని చెప్పారు. పేదలకు, పెత్తందారులకు మధ్య జరుగుతున్న యుద్ధంలో పెత్తందారుల వైపే చంద్రబాబు ఉన్నారని విమర్శించారు. నెల్లూరుకు చెందిన ఓ టీడీపీ నేత రాజధానిలో పేదల అసైన్డ్ భూములను అక్రమంగా లాక్కొని సిట్‌కు అడ్డంగా దొరికారని చెప్పారు. సామాన్యులకు పార్లమెంట్, శాసనమండలి, శాసనసభల్లో అవకాశం కల్పించిన మహోన్నత వ్యక్తి జగనన్న అని కొనియాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 2022 – 23లో 98 శాతం సబ్‌ప్లాన్ నిధులతో ఎస్సీలకు మేలు జరిగిందన్నారు. ఎస్సీలకు చేకూరిన లబ్ధిపై సామాజిక న్యాయ బస్సుయాత్రను సాగిస్తున్నామని వివరించారు. అనంతరం జూపూడి మాట్లాడారు. ఈ నెల 26 నుంచి చేపట్టనున్న బస్సు యాత్రను విజయవంతం చేయాలని కోరారు.

పేదలకు మెరుగైన వైద్యమే లక్ష్యం



వృద్ధుడితో మాట్లాడుతున్న రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

• ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: పేదలకు మెరుగైన వైద్యాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందులో భాగంగానే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 10, 11వ వార్డులకు సంబంధించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. 45 రోజుల పాటు నిర్వహించనున్న కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దీర్ఘకాలిక వ్యాధులుంటే పెద్ద ఆస్పత్రికి సిఫార్సు చేస్తున్నారని, ఈ ప్రక్రియను ఉచితంగా అందిస్తున్నారని తెలిపారు. విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వివరించారు. ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి, ఆర్డీఓ శీనానాయక్, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకటనారాయణ, కుందుర్తి శ్రీనివాసులు, కుందుర్తి కామయ్య, కుందుర్తి సునీత, ఆత్మకూరు రాజేష్, అక్కిలగుంట మాల్యాద్రి, పొనుగోటి అనూరాధ, షాహుల్ హమీద్, డేగా రాముయాదవ్, నాగేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక భవనాల్లో ఆర్ఐఈ కార్యకలాపాలు



శంకుస్థాపన చేసిన ప్రాంతంలో మైసూరు ఆర్ఐఈ బృందం పరిశీలన

వెంకటాచలం: కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నెల్లూరులో ఏర్పాటు చేసిన రీజినల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ (ఆర్ఐఈ) కార్యకలాపాలను తాత్కాలిక భవనాల్లో ప్రారంభించేలా చర్యలు చేపడతామని మైసూరు ఆర్ఐఈ ప్రిన్సిపల్ శ్రీకాంత్ పేర్కొన్నారు. వెంకటాచలం మండలం చవటపాళెం వద్ద ఆర్ఐఈ భవనాల ఏర్పాటుకు కేటాయించిన స్థలాన్ని ఆర్ఐఈ బృందం బుధవారం పరిశీలించింది. కార్యకలాపాలను తాత్కాలికంగా ప్రారంభించేందుకు వీలుగా చవటపాళెం సమీపంలోని ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాల భవనాలను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. నెల్లూరులో ఆర్ఐఈ ఏర్పాటుకు స్థలాన్ని 2016లో కేటాయించి శంకుస్థాపన చేసినా, కొన్ని కారణాలతో భవనాలను ఇప్పటికీ నిర్మించలేదని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లామని, త్వరలో సమస్యలు పరిష్కారమవుతాయని వివరించారు. 2024 – 25 సంవత్సరానికి నెల్లూరులో ఆర్ఐఈ కార్యకలాపాలను తాత్కాలిక భవనాల్లో ప్రారంభించేలా అన్ని ఏర్పాట్లు చేస్తామని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాలకు సంబంధించిన స్కూల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులకు ఇక్కడి నుంచే శిక్షణ ఇవ్వొచ్చని పేర్కొన్నారు. ఉపాధ్యాయ విద్య, నైపుణ్య కార్యక్రమాలను అందించే ఈ విద్యా సంస్థ ఏపీ విద్యారంగంలో కీలకపాత్ర పోషించగలదని పేర్కొన్నారు. తాత్కాలిక భవనాల్లో కార్యకలాపాలను త్వరలోనే ప్రారంభించనున్నామని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడికి శ్రీకాంత్ ఫోన్ ద్వారా తెలియజేశారు. మైసూరు ఆర్ఈఐ హెచ్ఓడీ కల్పన వేణుగోపాల్, డీఈఓ గంగా భవానీ, ఎంఈఓ శ్రీనివాసులురెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ మధు తదితరులు పాల్గొన్నారు.

దొంగల ముఠా అరెస్ట్

• రూ.ఐదు లక్షల చోరీ సొత్తు స్వాధీనం



వివరాలను వెల్లడిస్తున్న శివాజీరాజా


నెల్లూరు(క్రైమ్): ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొట్టి రాగి వైర్లు, అల్యూమినియం కేబుళ్లు, వ్యవసాయ మోటార్లను అపహరించి తప్పించుకొని తిరుగుతున్న ఏడుగురు సభ్యులతో కూడిన ముఠాను పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. నిందితుల వివరాలను నెల్లూరు సీసీఎస్ డీఎస్పీ శివాజీరాజా తన కార్యాలయంలో వెల్లడించారు. కావలి పట్టణంలోని వెంగళరావునగర్‌కు చెందిన కల్యాణ్, ఏడుకొండలు, ఇందిరమ్మకాలనీకి చెందిన పెంచలయ్య, వెంకటేశ్వర్లు, తిరుపతి, గోపీ అలియాస్ గోపయ్య, రమణ బంధువులు. వ్యసనాలకు బానిసైన వీరు దొంగలుగా అవతారమెత్తారు. ముఠాగా ఏర్పడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొట్టి రాగి వైర్లు, అల్యూమినియం కేబుల్ వైర్లు వ్యవసాయ మోటార్లను చోరీ చేసి వీటిని విక్రయించి సొమ్ము చేసుకోసాగారు. వరుస చోరీలపై ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు సీసీఎస్ డీఎస్పీ పర్యవేక్షణలో కలిగిరి ఇన్‌స్పెక్టర్ ఫిరోజ్, క్రైమ్ బ్రాంచ్ ఎస్సై ఉమాశంకర్, కొండాపురం, వింజమూరు ఎస్సైలు ఖాజావలీ, కోటిరెడ్డి తమ సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కావలి సమీపంలోని ముసునూరు రైల్వేట్రాక్ వద్ద ముఠాను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం తమదైన శైలిలో విచారించారు. జలదంకి పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగు, వింజమూరు, ఏఎస్‌పేట పరిధిలో మూడు చొప్పున, కావలి రూరల్, గుడ్లూరు, సైదాపురం పరిధిలో రెండు చొప్పున, వీకేపాడు, మర్రిపాడు, నెల్లూరు రూరల్, కొండాపురం, చేజర్ల పరిధిలో ఒక్కో దొంగతనం చేశామని నిందితులు అంగీకరించారు. దీంతో వీరిని అరెస్ట్ చేసి చోరీకి గురైన రూ.ఐదు లక్షల విలువజేసే రాగి, అల్యూమినియం కేబుల్ వైర్, వ్యవసాయ మోటార్, నేరాలు చేసేందుకు వినియోగించిన బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి చోరీ సొత్తును రాబట్టేందుకు కృషి చేసిన అధికారులు, సిబ్బందిని డీఎస్పీ అభినందించి రివార్డులను అందజేశారు.

1.6 కిలోల గంజాయి స్వాధీనం

• ఐదుగురి అరెస్ట్

కందుకూరు: గంజాయి విక్రయంతో పాటు సేవిస్తున్న ఐదుగుర్ని అరెస్ట్ చేసి వారి నుంచి 1.6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ రామచంద్ర తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను ఆయన వెల్లడించారు. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి, దేవేంద్రనగర్‌కు చెందిన బెన్నెల రవి గంజాయిని సరఫరా చేస్తున్నారు. కందుకూరులోని తూర్పువడ్డెపాళేనికి చెందిన కందుల రాజు బేల్దారి పనుల నిమిత్తం వెళ్లి కూకట్‌పల్లిలో ఉంటున్నారు. ఈ క్రమంలో వీరి మధ్య పరిచయం ఏర్పడింది. దీంతో వీరు హైదరాబాద్‌తో పాటు కందుకూరులో గంజాయి విక్రయాలను ప్రారంభించారు. విశాఖపట్నానికి చెందిన గంజాయి వ్యాపారి రాముతో సంబంధాలు పెట్టుకొని అక్కడి నుంచి తీసుకొచ్చి విక్రయిస్తూ సొమ్ము చేసుకోసాగారు. కందుకూరులోని కీసరగుంట కాలనీకి చెందిన అరితోటి వంశీ, కోటారెడ్డినగర్‌కు చెందిన చిమ్మిరి హరికృష్ణ, వలేటివారిపాళెం మండలం అత్తింటివారిపాళేనికి చెందిన కారంశెట్టి సుధాకర్.. వీరూ ముఠాగా ఏర్పడ్డారు. కందుకూరుతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని సరఫరా చేయసాగారు. ఈ క్రమంలో క్లబ్ రోడ్డు ఎదురుగా ఉన్న కుంచాల శ్రీను ప్లాట్స్ వద్ద గంజాయిని సేవిస్తున్నారనే సమాచారంతో పోలీసులు దాడులు చేశారు. నిందితులను పట్టుకొని వారి నుంచి 1.6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పూర్తి స్థాయిలో విచారించగా, అసలు విషయం బయటపడింది. గంజాయి సరఫరాదారుడు రాము మినహా మిగిలిన వారిని అరెస్ట్ చేశామని తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ వివరించారు. సీఐ నఫీజ్‌బాషా, పట్టణ ఎస్సై హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి



మర్రిపాడు: బైక్ అదుపు తప్పడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని సింగనపల్లి వద్ద బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని కృష్ణాపురానికి చెందిన సుబ్బరాయుడు (55) పనుల నిమిత్తం బద్వేల్‌కు టీవీఎస్ ఎక్సెల్‌పై వెళ్లారు. అనంతరం తిరిగొస్తుండగా, సింగనపల్లి సమీపంలో వాహనం అదుపుతప్పింది. దీంతో కిందపడిన ఆయన మృతి చెందారు. మర్రిపాడు పోలిసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని వాహనచోదకుడికి గాయాలు

మర్రిపాడు: బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని డీసీపల్లి టోల్ గేట్ సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు.. డీసీపల్లికి చెందిన రామిరెడ్డి కరటంపాడుకు వెళ్తుండగా కర్ణాటక నుంచి నెల్లూరు వెళ్తున్న ఓ కారు వెనుక నుంచి ఢీకొంది. ప్రమాదంలో రామిరెడ్డి కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడ్ని హైవే అంబులెన్స్‌లో ఆత్మకూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి సజీవ దహనం

కోవూరు: మతిస్థిమితం లేకుండా అనారోగ్యంతో బాధపడుతూ పూరిపాకలో నివాసముంటున్న వృద్ధురాలు (80) సజీవ దహనమైన ఘటన మండలంలోని కోనమ్మతోటలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. మతిస్థిమితం లేక బాధపడుతున్న వృద్ధురాలు పూరిపాకలో ఉంటున్నారు. ఈ క్రమంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి పూరిపాక దగ్ధమై ఆమె మృతి చెందారు. విషయం తెలుసుకున్న కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.25 వేల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ ప్రసాద్, ఎస్సై రంగనాథ్‌గౌడ్ ఘటన స్థలానికి చేరుకొని కుటుంబానికి అవసరమైన సౌకర్యాలు అందించారు.




దసరా అంటే సెలవులు.
దసరా అంటే అయ్యవార్లతో పిల్లలు కలిసి వెళ్లి పాడే పాటలు.
దసరా అంటే పగటి వేషాలు. దసరా అంటే బతుకమ్మలు.
దసరా అంటే బొమ్మల కొలువులు.
దసరా అంటే ఊళ్ల నుంచి విచ్చేసే బంధువులు.
జేబు నుంచి తీసి ఇవ్వాల్సిన ఆత్మీయ మామూళ్లు.
దసరా అంటే స్త్రీ, పురుషులకు ఉల్లాసం.
పిల్లలకు ఆటవిడుపు. కాలం చాలా మారింది. నాటి దసరా ఎలా ఉంటుందో
నేటి తరాలకు పదే పదే చెప్పాల్సిన అవసరం ఏర్పడింది.
పెద్దలకు గుర్తు చేయాల్సిన బాధ్యత కూడా.

'ఏ దయా మీ దయా మా మీద లేదు ఇంత నిర్లక్ష్యమా ఇది మీకు తగదు
పావలా అర్ధయితే పట్టేది లేదు ముప్పావలా అయితే ముట్టేది లేదు
హెచ్చు రూపాయయితే పుచ్చుకుంటాము
అయ్యవారికి చాలు ఐదు వరహాలు పిల్లవారికి చాలు పప్పు బెల్లాలు'...

• ఒకనాటి దసరా

లేదయా మీ దయా మా మీద లేదు

ఒకప్పుడు దసరా వస్తే పిల్ల దండును వెంట బెట్టుకుని అయ్యవార్లు బయలుదేరేవారు. ఇంటింటికి తిరిగేవారు. మామూళ్లు స్వీకరించేవారు. ఆ రోజుల్లో ఊళ్లలో బడి కొత్త. చదువు కొత్త. అయ్యవార్లకు జీతాలు అంతంత మాత్రం. సంవత్సరంలో నేర్పిన విద్య దసరా సెలవుల్లో పెద్దల ముందు అయ్యవార్లు పిల్లల చేత ప్రదర్శింపచేసేవారు. పిల్లల తెలివితేటలు చూసి పెద్దలు ముచ్చట పడేవారు. బడికి చందాలు, అయ్యవార్లకు మామూళ్లు ఇచ్చేవారు. ఆ సమయంలో ఇలా పైన రాసిన పాట పాడేవారు. ఇంతకీ వరహా అంటే మూడున్నర రూపాయి.

దసరా కోసం పిల్లలు ఎదురు చూసేవారు. ఆ సమయంలో పిల్లల్ని బంధువుల వద్దకు పంపుతామనే హామీ ఉండేది. అవ్వా, తాతల దగ్గరికో, బాబాయి దగ్గరికో, మేనత్త ఊరికో నాలుగు జతలు పెట్టుకుని పిల్లలు ఉత్సాహంగా వెళ్లేవారు. దసరా సెలవులు హాయిగా గడిపేవారు.

దసరా వేషాలు

దసరాలో పిల్లలకు, పెద్దలకు ఆసక్తి దసరా వేషాలు. చాలా మంది కళాకారులు పురాణ వేషాలు కట్టి ఇళ్ల ముందుకు వచ్చి కానుకలు స్వీకరించేవారు. పిల్లలకు ఈ వేషాలు చూడటం మహా సరదా. సీతారాములు, హనుమంతుడు, నారదుడు, శివుడు, అర్ధ నారీశ్వరుడు... ఇక పులి వేషాలు తప్పనిసరి. ఆ రోజుల్లో పులిని చూడటం అరుదు కాబట్టి (సినిమాల్లో తప్ప) మనిషే పులి రూపు కట్టి ఎదురు పడితే అబ్బురపడేవారు. తప్పెట్ల మోతకు వేషగాళ్లు లయబద్ధంగా ఆడుతుంటే నోరు తెరిచి చూసేవారు. నేలన పడేసిన రూపాయి కాసునో నిమ్మకాయనో పులి వేషగాడు నోట కరవడం ఒక ఘట్టం. దసరా నవరాత్రులు వైభవంగా జరుగుతాయి కదా. అలా ఎవరైనా ఎప్పుడూ కళకళలాడుతూ ఉంటే 'దసరా బుల్లోడు' అనడం ఆనవాయితీ.

బొమ్మల కొలువులు

ఇక బొమ్మల కొలువు పెట్టి ఆనందించడం ఆడపిల్లల వంతు. బొమ్మల కొలువును ఎప్పుడూ బేసి సంఖ్య మెట్ల మీద ఏర్పాటు చేస్తారు. ఇంటి ఆచారాన్ని బట్టి ఇంటి ఆడపిల్ల చేత పార్వతీ పరమేశ్వరులను గాని, సీతారాములను గాని, రాధాకృష్ణులను గాని, లక్ష్మీ సరస్వతులను గాని పెట్టిస్తారు, అమ్మాయి మొదటి దేవతా మూర్తిని పెట్టాక, ఆ యేడు కొన్న కొత్త బొమ్మను తల్లి కూడా పట్టుకుని పెట్టిస్తుంది. ప్రతి ఏడు ఒక కొత్త బొమ్మ తప్పనిసరిగా కొనడం ఆచారం. ఈ క్రమం లోనే, కొండపల్లి బొమ్మలు, నక్కపల్లి బొమ్మలతో పాటు దేశదేశాల బొమ్మలు సేకరించి బొమ్మల కొలువులో పెట్టడం వ్యాప్తి లోకి వచ్చింది. అందంగా, కళాత్మకంగా అమర్చిన బొమ్మల కొలువు పేరంటానికి బంధు మిత్రులను పిలిచి తొమ్మిది రోజులూ పేరంటం చేస్తారు. పేరంటానికి పిల్లలూ పెద్దలూ కూడా వస్తారు. బొమ్మలకు హారతి ఇచ్చి ప్రసాదం పంచిపెడతారు.

బతుకమ్మ

తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమయిన పండగ బతుకమ్మ. బతుకమ్మ పండగ వస్తూందంటే తెలంగాణా పల్లెల్లో నూతన ఉత్సాహం వెల్లివిరుస్తుంది. అది ఒక పెద్ద సంబరంగా భావిస్తారు. ఇళ్ళు శుభ్రపరుస్తారు. చక్కగా అలంకరించు కుంటారు. ఆడపిల్లల్ని పుట్టింటికి తీసుకు వస్తారు. అత్తగారింట్లో వుండే ప్రతి ఆడపిల్లా పుట్టింటికి వెళ్లడం కోసం ఎదురు చూస్తుంటుంది. రంగు రంగుల పూలతో త్రికోణాకారంలో పేర్చి అలంకరించిన బతుకమ్మల చుట్టూ చప్పట్లు చరుస్తూ వలయంగా తిరుగుతూ బతుకమ్మ పాటలు పాడతారు. బొడ్డెమ్మతో మొదలు ఎంగిలిపువ్వు బతుకమ్మ, సద్దుల బతుకమ్మ.. ఇలా దేని ప్రత్యేకత దానిదే.. తొమ్మిది రోజుల పాటు సాగే ఈ బతుకమ్మలను నీటి ప్రవాహంలో నిమజ్జనం చేస్తారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అని సాగే ఈ పాటల్లో మహిళలు తమ కష్ట సుఖాలు, ప్రేమ, స్నేహం, బంధుత్వం, ఆప్యాయతలు, భక్తి, భయం, చరిత్ర, పురాణాలు మేళవిస్తారు. ఈ పాటలు చాలా వినసొంపుగా ఉంటాయి.



పటాలు, విగ్రహాలు




సంతృప్తికరమైన సేవ

ఆలయంలో అయినా, ఇంట్లో అయినా పూజను ఎంతో భక్తి శ్రద్ధలతో నిష్ఠగా చేస్తాం. ఇంట్లో ఉండే దేవతా మూర్తుల విగ్రహాలు, పటాలు, ఫొటో ఫ్రేములు జారిపడినా, పక్కకు ఒరిగిపోయినా అపశకునంగా భావిస్తారు. అందుకే మరింత శ్రద్ధగా పూజ చేయడంతోపాటు, పూజాసామగ్రిని ఎంతో జాగ్రత్తగా భద్రపరుస్తుంటారు. అయినప్పటికీ కొన్నిసార్లు విగ్రహాలు పాతబడి విరిగి పోవడం, ఫొటో ఫ్రేములు చిరిగిపోవడం లేదా తుప్పు పట్టి పాడైపోవడం జరుగుతుంటుంది. అలాంటి వాటిని వెంటనే తీసేసి కొత్తవాటిని పూజలో పెట్టుకుంటారు. మనలో చాలామంది ఇలానే పడేస్తుంటాము. తృప్తి గైక్వాడ్ మాత్రం ఈ విగ్రహాలను పడేయకుండా.. రీ సైకిల్ చేసి రకరకాల వస్తువులను తయారు చేస్తోంది. చెత్తగా మారకుండా... సరికొత్త హంగులు అద్ది అందంగా మారుస్తోంది.



మహారాష్ట్రలోని యోవలాలో పుట్టి పెరిగిన తృప్తి గైక్వాడ్ వృత్తిపరంగా నాసిక్‌లో స్థిరపడింది. న్యాయవాదిగా క్షణం తీరికలేని పని తనది. అయితే తన చుట్టూ ఉన్న సమాజంలో జరిగే విషయాలను ఎంతో ఆసక్తిగా గమనించే మనస్తత్వం కావడం వల్ల 2019లో ఓసారామె గంగానదిని చూడడానికి వెళ్లింది. అప్పుడు గంగానదిని వరదలు ముంచెత్తుతున్నాయి. ఇదే సమయంలో ... విరిగి పోయిన దేవతా మూర్తుల విగ్రహాలు, ఫ్రేములు తీసుకుని నదిలో వేయడానికి వచ్చాడు ఒకతను. అతన్ని చూసిన తృప్తి..''వీటిని నదిలో వేయకు. వీటిలో ఉన్న పేపర్, కార్డ్‌బోర్డ్, మట్టిబొమ్మలు నదిని మరింత కలుషితం చేస్తాయి'' అని చెప్పి అతను వాటిని నదిలో వేయకుండా వారించింది. అందుకు ఆ వ్యక్తి ఇక్కడ వేయవద్దు.. మరి వీటిని ఏం చేయాలి?'' అంటూ చికాకు పడ్డాడు. అప్పటికేదో సమాధానం చెప్పి అతణ్ణి పంపింది కానీ తృప్తి మనసులో కూడా 'అవును వీటిని ఏం చేయాలి?' అన్న ఆలోచన మొదలైంది. కొద్దిరోజులు తర్వాత వీటిని రీ సైకిలింగ్ చేసి ఇతర వస్తువులు తయారు చేయవచ్చన్న ఆలోచన తట్టింది తనకు. తన ఐడియాను కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, ఇరుగుపొరుగుతో పంచుకుంది. అంతా ప్రోత్సహించేసరికి .. పాత దేవతామూర్తుల విగ్రహాలు రీసైకిల్ చేయడం ప్రారంభించింది.

"దేవతల విగ్రహాల ఫొటోఫ్రేములను చక్కగా అలంకరించి నిష్ఠగా పూజిస్తారు. ఇటువంటి ఫ్రేములు పాడైతే పడేయాల్సిందే. ఇది నచ్చకే సంపూర్ణమ్‌ను తీసుకొచ్చాను. దేవుడి విగ్రహాలను శాస్త్రోక్తంగా నిమజ్జనం చేసిన తరువాతే రీసైక్లింగ్ చేస్తున్నాను. వాట్సాప్, ఫేస్‌బుక్‌ల చాలా మంది కస్టమర్లు నన్ను సంప్రదిస్తున్నారు. 2019 నుంచి ఇప్పటిదాకా వేల సంఖ్యలో రీసైక్లింగ్ చేసి పర్యావరణాన్ని కాపాడాను. అదేవిధంగా దేవుడి పటాలకు మంచి రూపాన్ని ఇవ్వడం ఎంతో తృప్తినిస్తోంది".

– తృప్తి గైక్వాడ్

సంపూర్తిగా...

విగ్రహాలను రీసైక్లింగ్ చేసేందుకు 'సంపూర్ణమ్' పేరిట స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసింది. సంపూర్ణమ్ టీమ్ దేవతామూర్తుల పాతవిగ్రహాలు, ఫొటోఫ్రేములను గుళ్లు, చెట్లకింద పడి ఉన్న వాటిని, ఇళ్లనుంచి సేకరిస్తుంది. ఈ విగ్రహాలను పూర్తిగా పొడిచేసి మొక్కలకు ఎరువులా మారుస్తారు. ఎరువుగా పనికిరాని ప్లాస్టర్ ఆఫ్ పారిస్ కలిసిన మట్టిని కుండలు, పాత్రలు, ఇటుక రాళ్లుగా తయారు చేస్తారు. వీటితో పక్షులు, జంతువులకు గూళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇలా తయారైన పాత్రల్లో పక్షులు, జంతువులకు ఆహారం, తాగునీటిని అందిస్తున్నారు. సంపూర్ణమ్ సేవలను మహారాష్ట్రలోని పూనే, నాసిక్, ముంబై, సోలాపూర్, సంగమ్నేర్‌లకు విస్తరించింది తృప్తి. ఇటీవల ఇతర రాష్ట్రాల్లో సైతం సేవలను ప్రారంభించింది. ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా ద్వారా ఈ రీసైక్లింగ్ గురించి అవగాహన కల్పిస్తోంది.



ఆకర్షణీయమైన టాయిస్..

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ కలిసిన విగ్రహాలను పొడిగా మార్చి, ఈ పొడికి కొద్దిగా సిమెంట్‌ను కలిపి టాయిస్‌ను రూపొందిస్తున్నారు. మురికివాడల్లోని నిరుపేద పిల్లల ద్వారా పాతవిగ్రహాలు, ఫొటోఫ్రేమ్‌లనూ సేకరిస్తూ వారికి ఆర్థికంగా సాయపడుతోంది.

న్యూస్ మేకర్

కల్లోల ఇజ్రాయెల్‌లో ఇండియన్ సూపర్ ఉమెన్



బతికి ఉంటే బలుసాకు తిని బతకవచ్చు... అనుకునే భయానక పరిస్థితుల్లో ఉండి కూడా, తమకు ఏమైనా ఫరవాలేదు, నిస్సహాయులైన వృద్ధదంపతులకు ఏమీ కాకూడదని వారిని కంటికి రెప్పలా కాపాడారు ఇజ్రాయెల్‌లో హోమ్ నర్స్‌లుగా పనిచేస్తున్న కేరళకు చెందిన సబిత, మీరా మోహన్‌లు...

దక్షిణ ఇజ్రాయెల్...

గాజా సరిహద్దుకు రెండో కిలోమీటర్ల దూరంలో ఉన్న నిర్ ఓజ్ కిబ్బట్జ్ పట్టణంలో ఒక ఇంట్లో...

85 సంవత్సరాల షొలిక్, 76 సంవత్సరాల రహెల్ దంపతులకు నలుగురు పిల్లలు. పిల్లలు వేరు వేరు ప్రాంతాలలో ఉంటున్నారు. రహెల్ అనారోగ్యంతో బాధ పడుతోంది. ఆమెను చూసుకోవడానికి ఆరోజు ఆ ఇంట్లో సబిత, మీరా మోహన్ అనే ఇద్దరు హోమ్‌నర్స్‌లు ఉన్నారు.

ఉదయం ఆరున్నర ప్రాంతంలో సైరన్ మోత వినిపించింది. ప్రజలు బాంబ్ షెల్టర్‌లలో తల దాచుకోవాలని చెప్పే సైరన్ అది.

'ఆ ఉదయం సైరన్ మోగేసరికి గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి. సెకండ్ల వ్యవధిలో సేఫ్టీరూమ్‌లోకి వెళ్లాలి. ఇంతలో రహెల్ కుమార్తె నుంచి ఫోన్ వచ్చింది. బయట పరిస్థితి భయానకంగా ఉంది అని ఆమె చెప్పింది. మాకు ఏం చేయాలో తోచలేదు. ఇంటి ముందు, వెనుక తలుపులకు తాళాలు వేసి అమ్మానాన్నలను తీసుకొని, పాస్‌పోర్ట్, డైపర్‌లు, యూరిన్ పాట్, మందులతో సెక్యూర్ రూమ్‌లోకి వెళ్లాలని ఆమె చెప్పింది. షొలిక్, అనారోగ్యంతో ఉన్న రహెల్‌ను నడిపించుకుంటూ షెల్టర్ రూమ్‌లోకి వెళ్లాం. ఈలోపే మిలిటెంట్‌లు ఇంట్లోకి ప్రవేశించారు. అద్దాలు బద్దలు కొట్టారు. వస్తువులు ధ్వంసం చేశారు. షెల్టర్‌రూమ్‌పై కాల్పులు జరుపుతున్నారు. ఐరన్ డోర్ వెనకే మా శరీరాలను గట్టిగా ఆనించి ఎన్నో గంటలపాటు నిల్చున్నాం. అదృష్టవశాత్తు ఐరన్ డోర్ ధ్వంసం కాలేదు. ధ్వంసం అయి ఉంటే ఎవరి ప్రాణాలు మిగిలేవి కావు' అంటూ ఆ భయానక ఘటనను గుర్తు తెచ్చుకుంది 39 సంవత్సరాల సబిత.



• మీరా మోహన్, సబిత

కేరళకు చెందిన సబిత, మీరా మోహన్‌ల సాహసం, మానవత్వం గురించి ఢిల్లీలోని ఇజ్రాయెల్ రాయబార కార్యాలయం 'ఇండియన్ సూపర్ ఉమెన్' అంటూ ప్రశంసించింది.

టిప్స్



• రెండు కర్పూరం బిళ్లలు, మూడు కప్పుల వేపాకుల్లో కొద్దిగా కొబ్బరి నూనె వేసి పేస్టుచేయాలి. ఈ మిశ్రమాన్ని చుండ్రు ఉన్న ప్రాంతంలో రాసి మర్దన చేయాలి. చుండ్రు బాధ క్రమంగా తగ్గిపోతుంది. కర్పూరం పొడిని ఆలివ్ నూనెలో వేసి కలిపి జుట్టుకు పట్టించినా చుండ్రు తగ్గుతుంది.

ఈ రెండింటిలో ఏదైనా ఒకటి వారానికి మూడుసార్లు చేస్తే ఉపశమనం త్వరగా వస్తుంది.

• కాలివేళ్ల సందుల్లో గాలి తగలక పాచిపడుతుంటుంది. ఇలా జరగకుండా ఉండాలంటే...కాళ్లను శుభ్రంగా కడిగి, తడిలేకుండా తుడవాలి. ఇప్పుడు టూత్‌పేస్టుని వేళ్ల సందులో రాయాలి. రోజూ పడుకునేముందు ఇలా చేస్తే కాళ్లు పాయవు.



హాబీతో వయసును ఓడించాను



రవి బాల శర్మ

సాధారణంగా 65 ఏళ్ల వయసులో మోకాళ్ల నొప్పులు, నడుము నొప్పి అంటూ బాధ పడేవారిని చూస్తుంటాం. కానీ, రవి బాల శర్మ బాలీవుడ్ తారలకు దీటుగా డ్యాన్సులు చేస్తూ సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తున్నారు. ఆమె అసలు పేరుకన్నా 'డాన్సింగ్ దాదీ'గా ఫేమస్ అయ్యింది. మహిళలే కాదు యువత కూడా ఆమె డ్యాన్స్ స్టెప్పులకు ఆశ్చర్యపోతూ ఫాలో అవుతున్నారు. ఈ వయసులో పూజలు చేసుకోకుండా డ్యాన్సులు ఏంటి అనేవారికి మీలో స్కిల్స్ లేకనే ఇలాంటి విమర్శలు చేస్తున్నారని ఘాటుగా సమాధానం చెబుతుంది. ఇంతకీ ఎవరీ రవి బాల శర్మ...

''నా పేరు ముందు రవి అని అబ్బాయిల పేరు ఉంటుంది. మా చెల్లి పేరు శశి ప్రభ శర్మ అంటే చంద్రుడు. నా పేరులో సూర్యుడు ఉండాలని రవి అని నాన్న అనుకున్నారట. అందుకే బాల అనే నా పేరు ముందు రవి చేర్చారు. చాలా మంది నా పూర్తి పేరు తెలుసుకోకుండా మిస్టర్ అని సంబోధిస్తుంటారు. నేను స్కూల్ టీచర్‌గా చేసే రోజుల్లో ప్రమోషన్ జాబితాలో నా పేరు కనిపించలేదు. విషయమేంటని ఆరా తీస్తే మగ టీచర్ల జాబితాల్లో నా పేరు ఉందని తెలిసింది.

సంగీత వారసత్వం

ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్‌లో పుట్టి పెరిగాను. మా ఇంట్లో ఎప్పుడూ సంగీత వాతావరణం ఉంటుంది. మా నాన్న సంగీత ఉపాధ్యాయుడు. అనేక వాద్యాలను వాయించేవాడు. ఆయన దగ్గరే శాస్త్రీయ సంగీతం నేర్చుకున్నాను. మా అమ్మ కూడా చాలా బాగా పాడేది. కానీ, పిల్లల పెంకంలో ఆమె ఎప్పుడూ బిజీగా ఉండేది. మా నాన్న కొడుకు, కూతురు అనే తేడా చూడలేదు. నా కూతుళ్లు తమ కాళ్లపై తాము నిలబడగానే పెళ్లి చేస్తానని చెబుతుండేవాడు. దీంతో ఎవరిపైనా ఆధారపడాల్సిన అవసరం రాలేదు. పాడటమే కాకుండా కథక్ డ్యాన్స్‌లో శిక్షణ తీసుకున్నాను. సితార్, తబలా కూడా వాయిస్తాను. హిందీలో మాస్టర్స్ డిగ్రీ తీసుకున్నాను. 27 ఏళ్లుగా ఢిల్లీ ప్రభుత్వ పాఠశాలలో మ్యూజిక్ టీచర్‌గా ఉన్నాను. పెళ్లయ్యాక ఇల్లు, పిల్లలు, స్కూలు బాధ్యతలతో బిజీ అయిపోయాను. నా ఆసక్తుల గురించి పట్టించుకోలేదు. స్కూల్లో పిల్లలకు సంగీతం నేర్పించడంలో ఎంతో సంతృప్తి ఉండేది. కానీ, సంగీతం టీచర్లకు మిగతా టీచర్లకు ఉన్నంత ప్రాధాన్యత ఉండేది కాదు.





కొడుకుతో కలిసి..

నా భర్తకు కేన్సర్ అని తెలియగానే కుప్పకూలిపోయాం. అతని మరణం నన్ను బాగా కుంగదీసింది. కూతురికి పెళ్లయ్యింది. మా అబ్బాయి ఏకాంష్ రచయిత, నటుడు. దీంతో అతనితో పాటు ముంబై వచ్చాను. లాక్డౌన్ సమయంలో మా అబ్బాయి సోషల్ మీడియా అకౌంట్‌ను క్రియేట్ చేశాడు. నన్ను విషాదం నుంచి తేరుకునేలా చేసేందుకు కొన్ని వీడియోలు షూట్ చేసేవాడు. ఆ తర్వాత వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం ప్రారంభించాడు. వాటిని చూసి, వస్తున్న ప్రశంసలు చూసి నేనూ చాలా ఎంజాయ్ చేయడం మొదలుపెట్టాను. మొదట్లో పెద్దగా వ్యూస్ రాకపోయినా తర్వాత ఫేమస్ అయ్యాను.

వైరల్ అయిన విధం..

గాయకుడు, గేయ రచయిత దిల్జీత్ దోసాంజ్ పాటకు డ్యాన్స్ చేసి, ఇన్‌స్టాలో పోస్ట్ చేస్తే, ఆ వీడియోను అతను షేర్ చేయడంతో తెగ వైరల్ అయ్యింది. ఆ తర్వాత వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. నా డ్యాన్స్ టాలెంట్ నన్ను సోషల్ మీడియాకు 'డ్యాన్స్ దాది'ని చేసింది. లక్షలాది మంది అభిమానులను తెచ్చిపెట్టింది.

బాలీవుడ్ తారలు

ఏ నటి పాటతో డ్యాన్స్ చేసినా ఆమె నా వీడియోను షేర్ చేసేంతగా పేరు రావడం నిజంగా ఆశ్చర్యమనిపించింది. ఈ వయస్సులో డ్యాన్స్ చేయడం చూసి వాళ్లూ ఆశ్చర్యపోతుంటారు. కానీ నా వయస్సును హాబీకి దూరంగా ఉంచుతున్నాను. నృత్యం నా హాబీ. అది నన్ను నా మనసులో ఎప్పుడూ యవ్వనంగా ఉంచుతుంది. నా డ్యాన్స్ వీడియోలు చూసిన తర్వాత చాలామంది మహిళలు 'మీ నుంచి చాలా స్ఫూర్తి పొందుతున్నామ'ని చెబుతుంటారు. చాలా మంది యువకులు కూడా నా డ్యాన్స్ ఫాలో అవుతున్నారు. కొందరు మాత్రం 'ఈ వయసులో పూజలు చేసుకోకుండా, డ్యాన్స్ ఎందుకు, నడుం పట్టేస్తుంది జాగ్రత్త' అని కామెంట్స్ చేస్తుంటారు. అలాంటి వారికి నేను భయపడను. వారికి డ్యాన్స్‌లో స్కిల్ లేదు. కాబట్టి, వారికి ఆ కళ తెలియదు. విమర్శించేవారు వారి వ్యక్తిగత చిరాకుల కారణంగానే అలాంటి కామెంట్స్ చేస్తారు అనిపిస్తుంది. కొందరికి ఇష్టం ఉన్నా తమలో ఉన్న బిడియం వల్ల డ్యాన్స్ చేయలేరు. ఇంకొందరు తమకు నచ్చినది ఇతరులు చేయడం చూస్తే 'నేనెందుకు చేయలేకపోయాను' అని బాధపడతారు. ఇది ఒకరకమైన మానసిక రుగ్మత తప్ప మరొకటి కాదు. అలాంటి వారిపై మన శక్తిని వృథా చేయకూడదు. ఎందుకంటే అది మనల్ని ముందుకెళ్లకుండా ఆపుతుంది.




వయసు ఓ సంఖ్య మాత్రమే!

హృదయంలో పిల్లల్లాగే ఉండి, హాబీస్‌తో జీవిస్తున్నట్లయితే మిమ్మల్ని ముందుకు వెళ్లకుండా ఎవ్వరూ ఆపలేరు. అదే, ఎన్నో విషాదాలను వెనక్కి నెట్టేస్తుంది. మీ హాబీ మిమ్మల్ని యంగ్‌గా ఉండటానికి సహాయపడుతుంది. ఇలాంటప్పుడు వయసు తన ప్రభావాన్ని చూపడంలో ఎప్పుడూ ఫెయిల్ అవుతుంది. నేను డాన్స్ చేయకపోతే వయసు నన్ను ఓడించేది. కానీ, నా హాబీని సజీవంగా ఉంచుకుని, దానిని పూర్తి స్థాయిలో జీవించడం ద్వారా వయసును ఓడించాను'' అని ఆనందంగా తెలియజేస్తారు ఈ డ్యాన్సర్.